'మహిళా శక్తి' యూనిట్ల పంపిణీకి ఏర్పాట్లు చేయాలి

గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారుల సమీక్షలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మామిళ్లగూడెం, ఆగస్టు 30: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఇందిరా మహిళా శక్తి పథకంలో చేపట్టిన వివిధ యూనిట్లను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అధికారులను ఆదేశించారు. ఇందిరా మహిళాశక్తి యూనిట్లపై జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో ఖమ్మం కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. అధికారులు క్షేత్రస్థాయిలో ఉంటూ మండలాల వారీగా మహిళా శక్తి పథకానికి కార్యాచరణ చేయాలని సూచించారు. స్థానికంగా ఉన్న డిమాండ్‌ను బట్టి యూనిట్లను ఎంపిక చేయాలన్నారు. బ్యాంక్ లింకేజీ రుణాలతో పచ్చళ్లు తయారీ, కిరాణా, మొబైల్ టిఫిన్ సెంటర్, మెకానిక్, టీ స్టాల్, మెడికల్ షాపు, ఫెర్టిలైజర్ షాప్, మీసేవా, పాడి పశువులు, పౌల్ట్రీ, బోటిక్, లాండ్రీ, బ్యూటీపార్లర్ వంటి వ్యాపార యూనిట్ల ఏర్పాటుకు లబ్ధిదారుల ఎంపిక చేపట్టాలని ఆదేశించారు. యూనిట్లు నడుపుతూ అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఒకే గ్రామం, ఒకే ప్రాంతంలో ఒకే తరహా యూనిట్లు ఒకటి కంటే ఎక్కువ ఏర్పాటు కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. యూనిట్ క్యాచ్‌మెంట్ ఏరియా లభదాయకంగా ఉండేలా చూడాలన్నారు. గ్రౌండింగ్ చేసిన యూనిట్ల లబ్ధిదారులు వ్యాపారంలో నిలదొక్కుకునే వరకు అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. డీఆర్‌డీవో సన్యాసయ్య, అదనపు డీఆర్‌డీవో నూరుద్దీన్, డీపీఎంలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

కూసుమంచి(నేలకొండపల్లి), ఆగస్టు 30 : వినాయక చవితి సందర్భంగా మండపాలు ఏర్పాటు చేసే భక్తులు, కమిటీల సభ్యులు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ సంజీవ్ తెలిపారు. నేలకొండపల్లిలో శుక్రవారం వినాయక చవితి మండలాల నిర్వాహకులతో మాట్లాడుతూ నిమజ్జనం సమయంలో డీజేలకు అనుమతి తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై సంతోష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మధిర, ఆగస్టు 30 : వినాయక మండపాలు ఏర్పాటు చేయదల్చిన వారు పోలీసుల అనుమతి తీసుకోవాలని మధిర సీఐ మధు, ఎస్సై సంధ్య తెలిపారు. సాంస్కృతిక కార్యక్రమాల ముసుగులో అసభ్యకరమైన, రికార్డు డ్యాన్సులు నిర్వహిస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఎర్రుపాలెం, ఆగస్టు 30 : గణేష్ మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని ఎస్సై పీ.వెంకటేష్ అన్నారు. ఎవరైనా బలవంతంగా విరాళాలు సేకరిస్తే కఠినచర్యలు ఉంటామని హెచ్చరించారు.

అవగాహన కల్పిస్తున్న నేలకొండపల్లి సీఐ సంజీవ్

తిరుమలాయపాలెం, ఆగస్టు 30 : గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో అల్లర్లకు పాల్పడే వారిపై కఠినచర్యలు తప్పవని స్థానిక ఎస్సై జగదీష్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని విజ్ఞప్తిచేశారు.

కుటుంబ నిర్ధారణ సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

మధిర ఏడీఏ విజయచంద్ర

బోనకల్లు, ఆగస్టు 30 : రుణమాఫీ పథకం కోసం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న కుటుంబ నిర్ధారణ సర్వేను పల్లెల్లో పకడ్బందీగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి కుటుంబానికి రుణమాఫీ అందుతుందని మధిర ఎస్.విజయచంద్ర అన్నారు. శుక్రవారం బోనకల్లు గ్రామంలో మండల వ్యవసాయాధికారి కొండూరి విజయభాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న సర్వేను మధిర వ్యవసాయ సంచాలకులు ఎస్.విజయచంద్ర పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ శనివారం రామాపురం, గార్లపాడు గ్రామపంచాయతీ కార్యాలయాల్లో సర్వే కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు రజిత, మరీదు త్రివేణి, గోగుల హరికృష్ణ, బద్దల కార్తీక్, నాగసాయి పాల్గొన్నారు.

సర్వేను తనిఖీ చేస్తున్న ఏడీఏ విజయచంద్ర

చింతకాని మండలంలో..

చింతకాని, ఆగస్టు 30 : మండల పరిధిలో మత్కేపల్లి, నామవరం గ్రామాల్లో జరుగుతున్న రుణమాఫీ కుటుంబ నిర్ధారణ సర్వే తీరును పరిశీలించి సంబంధిత ఏఈవోలకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి పల్లెల నాగయ్య, ఏఈవోలు, రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

భార్య ప్రేమకు గుర్తుగా.. హ్యాండ్‌కాస్టింగ్

భార్యకు గుర్తుగా తయారు చేసుకున్న హ్యాండ్‌కాస్టింగ్

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 30 : ప్రేమించి పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్న భార్య మృతిచెందడంతో భార్యకు చిహ్నంగా హ్యాండ్‌కాస్టింగ్ తయారు చేయించుకొని పదిల పర్చుకున్నాడు సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న పెనుబల్లి మండలం యడ్లబంజరకు చెందిన యడ్ల అశోక్‌ఖన్న. వివరాలు ఇలా ఉన్నాయి.. ఆంధ్ర రాష్ట్రంలోని చింతలపుడి మండలం చింతపల్లి గ్రామానికి చెందిన పద్మశ్రీ అనే యువతిని పదహారేళ్ల క్రితం ప్రేమించి, పెద్దలను ఒప్పించి వివాహం చేసుకున్నాడు. వీరికి ఓ కుమార్తె హర్షిత. కాగా కొన్ని రోజుల క్రితం పద్మశ్రీకి వైరల్ ఫివర్ రావడంతో మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించి గురువారం మృతిచెందింది. భార్య మృతిని జీర్ణించుకోలేని అశోక్‌ఖన్న ఆమె చిరకాల గుర్తుగా తన కూమార్తె హర్షిత, భార్య పద్మశ్రీ, తన చేతిలో వేసి హ్యాండ్‌కాస్టింగ్ ముద్రను తయారు చేయించుకొని గాజు పెట్టేలో పదిలం చేసుకున్నాడు. హ్యాండ్‌కాస్టింగ్‌ను ఆమె మృతదేహం పక్కన గాజు పెట్టెలో భద్రపరిచిన దృశ్యం మృతదేహాన్ని చూసేందుకు వచ్చిన పలువురిని కంటతడి పెట్టించింది.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

మామిళ్లగూడెం, ఆగస్టు 30: రైలు కిందపడి ఓ గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఖమ్మం నగర పరిధిలోని మల్లెమడుగు – ఖమ్మం రైల్వేస్టేషన్ పరిధిలో శుక్రవారం చోటుచేసుకుంది. జీఆర్‌పీ ఎస్ఐ భాస్కర్‌రావు కథనం ప్రకారం.. వందేభారత్ రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నట్లు సమాచారం అందడంతో జీఆర్‌పీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిసరాలు పరిశీలించారు. మరణించిన వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలూ లభించలేదు. మరణానికి గల కారణాలు తెలియలేదు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచామని, సంబంధీకులు ఎవరైనా ఉంటే ప్రభుత్వ రైల్వే పోలీసులనుగానీ, 8712658589 నెంబరునుగానీ సంప్రదించాలని సూచించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కూసుమంచి కళాశాలలో అధ్యాపకుల నియామకం

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 30: కూసుమంచిలో ఈ విద్యాసంవత్సరం ప్రారంభించిన జూనియర్ కళాశాలలో పనిచేసేందుకు 11 సబ్జెక్టులకు సంబంధించిన ఒప్పంద అధ్యాపకుల నియామక ఉత్తర్వులను డీఐఈవో రవిబాబు శుక్రవారం జారీ చేశారు. ఇంగ్లిష్, తెలుగు, సంస్కృతం, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ, బోటనీ, ఎకనామిక్స్, సివిక్స్, కామర్స్ అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు అధిక సంఖ్య వచ్చాయి. వీటిల్లో మెరిట్ ఆధారంగా స్క్రూట్నీ చేశారు. ట్రైనీ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ట పర్యవేక్షణలో అధ్యాపకులను ఎంపిక చేశారు. ఎంపికైన అధ్యాపకులకు ఇంటర్ విద్యాధికారి నుంచి శుక్రవారం సమాచారం అందజేశారు. ఎంపికైన ఒప్పంద అధ్యాపకులు శనివారం కూసుమంచి జూనియర్ కళాశాలలో రిపోర్ట్ చేసి విధుల్లో చేరాలని స్పష్టం చేశారు. ఇతర కళాశాలల నుంచి డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న అధ్యాపకులు వారి మాతృ కళాశాలలో హాజరుకావాలని సూచించారు.

నేటి నుంచి మూడు రోజులు ఏఎంసీకి సెలవులు

ఖమ్మం వ్యవసాయం, ఆగస్టు 30: ఈ నెల 31న శనివారం నుంచి మూడు రోజుల పాటు ఖమ్మం ఏఎంసీకి సెలవులు ఉంటాయని ఖమ్మం ఏఎంసీ సెక్రటరీ ప్రవీణ్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శని, ఆదివారాల్లో వారంతపు సెలవులు ఉంటాయని, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవులు ప్రకటించామని చెప్పారు. తిరిగి సెప్టెంబర్ 3న మంగళవారం మార్కెట్లో యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయన్నారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

'సదరన్ స్లాట్ బుక్ చేసుకోండి'

కూసుమంచి, ఆగస్టు 30 : దివ్యాంగుల కోసం ఏర్పాటు చేసిన సదరన్ క్యాంపు సెప్టెంబర్ నెల స్లాట్ శుక్రవారం ఓపెన్ అయ్యిందని, కావాల్సిన వారు రెన్యువల్ చేసుకునే వారు దానిని వినియోగించుకోవాలని ఎంపీడీవో వేణుగోపాల్‌రెడ్డి దివ్యాంగులను కోరారు.

పలు దుకాణాల్లో తనిఖీలు

కొణిజర్ల, ఆగస్టు 30 : మండలంలోని పలు వ్యాపార దుకాణాల్లో లీగల్ మెటరాలజీ డిపార్ట్‌మెంట్(తూనికలు, కొలతల శాఖ) అధికారులు శుక్రవారం విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. కిరాణా షాపులు, పురుగుమందుల షాపుల్లో తనిఖీలు చేపట్టిన వారు నిబంధనలు పరిశీలించి మార్కెటింగ్‌లోని లోపాలపై పంచనామా నిర్వహించారు. ఈ తనిఖీల్లో 60 వేల రూపాయల జరిమానా విధించి సంబంధిత కంపెనీల నుంచి వసూలు చేసినట్లు డిస్ట్రిక్ట్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

కూసుమంచి(నేలకొండపల్లి), ఆగస్టు 30 : విద్యార్థులు పాఠశాల స్థాయిలో విద్యతోపాటు క్రీడల్లో రాణించాలని, వారిలో నైపుణ్యతను వెలికితీయాల్సిన బాధ్యత ఉపాధ్యాయులు, తల్లిదండ్రులపై ఉందని మండల విద్యాశాఖ అధికారి రాములు అన్నారు. నేలకొండపల్లి మండలం బోదులబండలో మండలస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ప్రారంభించారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇవ్వాలని సూచించారు. పోటీల్లో మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకాన్ని అమలుచేయాలి

బోనకల్లు, ఆగస్టు 30 : రాష్ట్రంలో ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన మహాలక్ష్మి పథకాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయాలని భారత జాతీయ మహిళా సమైఖ్య(ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి లతాదేవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బోనకల్లులో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతితో కలిసి ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఆరు గ్యారెంటీలను అమలు పర్చాలని కోరారు. డిసెంబర్ నుంచి ఇప్పటివరకు ఎందరో యువతులు పెళ్లిళ్లు చేసుకున్నారని, వారికి రావాల్సిన కల్యాణలక్ష్మి పథకం రూ.1.50 లక్షలతో పాటు, 10 గ్రాముల బంగారాన్ని వెంటనే అందించాలని కోరారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించడానికి కావాల్సిన స్థలాల సేకరణ చేయడంతోపాటు, స్థలాలు ఉన్నవారికి వీలైనంత తొందరగా పథకాన్ని అమలుపరిచి ఇల్లు కట్టించి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సమాఖ్య మండల నాయకురాలు ఆకిన రేణుక, వెంగళలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక సేవకు అంకితమవ్వాలి

బోనకల్లు, ఆగస్టు 30 : ఉద్యోగ విరమణ అనంతరం సమాజానికి సేవ చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పారుపల్లి నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఆళ్లపాడు ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడు ఎంసీఆర్ చంద్రప్రసాద్ ఉద్యోగ విరమణ సన్మాన కార్యక్రమం ప్రధానోపాధ్యాయురాలు సీహెచ్ శ్రీలత అధ్యక్షత జరిగింది. ఎంఈవో వెంకటేశ్వర్లు, ఎంఎన్‌వో పుల్లయ్య, వీ.రాంబాబు, సదాబాబు, పీ.గోపాల్‌రావు, కోటయ్య, చిన్నరంగారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొక్కిరేణిలో డ్రైడే ఫ్రైడే

తిరుమలాయపాలెం, ఆగస్టు 30 : మండలంలోని కొక్కిరేణిలో శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమాలను ఎంపీడీవో శిలార్ పరిశీలించారు. సైడు కాల్వలను, నీటి నిల్వ ప్రాంతాలను, మంచినీటి పైపులైన్ లీకేజీలను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సామూహిక వరలక్ష్మి వ్రతాలు

ఖమ్మం, ఆగస్టు 30: ఖమ్మంలోని శ్రీరామకృష్ణ విద్యాలయంలో ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం 200పైగా ముత్తైదువలతో ఈ వ్రతాన్ని చేపట్టారు.

రోడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 30 : వర్షంతో సత్తుపల్లి రింగ్‌సెంటర్ వద్ద దెబ్బతిన్న రహదారులను ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి శుక్రవారం పరిశీలించారు. వాహనదారులు, ప్రజలు ఇబ్బంది పడకుండా తక్షణమే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సొసైటీ వైస్‌చైర్మన్ గాదె చెన్నారావు ఉన్నారు.

డయల్ యువర్ డీఎం కార్యక్రమం

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 30 : డయల్ యువర్ సత్తుపల్లి డీఎం కార్యక్రమాన్ని శనివారం సాయంత్రం 3నుంచి 4 గంటల వరకు నిర్వహించడం జరుగుతుందని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మీ శుక్రవారం తెలిపారు. 9959225962 నంబర్‌కు ఫోన్ చేసి మీ సమస్యలను డిపో మేనేజర్ దృష్టికి తీసుకురావాలని కోరారు.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

సత్తుపల్లిటౌన్, ఆగస్టు 30 : పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో పారిశుద్ధ్యం, పరిశుభ్రతపై ఎమ్మెల్యే చర్చ నిర్వహించారు. వార్డుల్లో డ్రైనేజీలు, నాళాలు ఎప్పటికప్పుడు శుభ్రం చేపించాలని, బ్లీచింగ్ ఫాగింగ్ చేపించాలని తెలిపారు. సీజనల్ వ్యాధుల గురించి కౌన్సిలర్లను అడిగి తెలుసుకున్నారు. ప్రతివార్డులో మెడికల్ సిబ్బందితో జ్వర పరీక్షలు చేపట్టాలని, క్యాంపులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్ కూసంపూడి మహేశ్, వైస్‌కౌన్సిలర్ సుజలా రాణి, కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైరా గురుకుల పాఠశాల సందర్శన

వైరాటౌన్, ఆగస్టు 30 : తెలంగాణ రాష్ట్ర గురుకుల పాఠశాలల సెక్రటరీ రమణకుమార్ వైరా బాలికల గురుకుల పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులతో మాట్లాడి పలు విషయాలు తెలుసుకున్నారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు. అదేవిధంగా పాఠశాల పరిసర ప్రాంతాలను, డార్మెంటరీని హాస్టల్ వసతులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి.రమా, పలువురు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

అత్యుత్తమ సాంకేతికతతో సేవలు : ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ

మామిళ్లగూడెం, ఆగస్టు 30: తెలంగాణ ఉత్తర మండల విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో అత్యుత్తమ సాంకేతికతతో వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎన్‌పీడీసీఎల్ ఖమ్మం సర్కిల్ ఎస్ఈ సురేందర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అన్నిరకాల విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరం సరఫరా చేసేందుకు అన్ని రకాల సాంకేతికతలనూ ఉన్నతీకరించినట్లు చెప్పారు. సబ్ స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాలను పెంచడంతోపాటు లైన్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టి అవాంతరాలు లేకుండా విద్యుత్‌ను అందిస్తున్నామని తెలిపారు. అలాగే, విద్యుత్ బిల్లులను యూపీఐ యాప్‌ల ద్వారా చెల్లించేందుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు.

మాంగో డీబీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా ఎస్‌బీఐటీకి గుర్తింపు

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 30: ఖమ్మంలోని ఎస్‌బీఐటీ కళాశాలకు మాంగో డీబీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌గా గుర్తింపునిచ్చిందని ఆ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. ఈ మేరకు హైదరాబాద్‌లో శుక్రవారం నిర్వహించిన సదస్సులో సంస్థ ప్రతినిధుల నుంచి సంబంధిత పత్రాలను తాము అందుకున్నట్లు చెప్పారు. తమిళనాడుకు చెందిన ఐసీటీ అకాడమీ సహకారంతో మాంగో డీబీ కోర్సులను తమ విద్యార్థులు మెరుగుగా ఉపయోగించుకునే అవకాశం ఉందన్నారు. ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో ఉద్యోగ అవకాశాలు లభిస్తాయన్నారు. కరస్పాండెంట్ డాక్టర్ ధాత్రి, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో పండ్లు పంపిణీ

ఖమ్మం సిటీ, ఆగస్టు 30: సినీనటుడు నందమూరి బాలకృష్ణ సినిమా రంగంలోకి ఆరంగేట్రం చేసి యాభై వసంతాలు పూరిచేసుకున్న నేపథ్యంలో ఆయన అభిమాన సంఘం బాధ్యులు శుక్రవారం ఖమ్మంలో గోల్డెన్ జుబ్లీ ఉత్సవాలను నిర్వహించారు. దీనిలో భాగంగా ఖమ్మంలోని సత్యసాయి వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సామాజిక సేవల పట్ల నిమగ్నమవుతున్న బాలకృష్ణ.. క్యాన్సర్ బాధితులకు ఉచిత వైద్య సేవలు అందించడంలోనూ కీలకపాత్ర పోషిస్తున్నారని అన్నారు. బాలకృష్ణ అభిమాన సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

కన్నబిడ్డలను కడతేర్చిన వ్యక్తికి జీవిత ఖైదు

మధిర/ మధిర రూరల్, ఆగస్టు 30 : భార్యపై ఉన్న అనుమానంతో కన్నబిడ్డలను కడతేర్చిన ఓ వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష పడింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో స్కూల్‌లో ఉన్న పిల్లలను ఇంటికి తీసుకొచ్చి హత్య చేసిన ఘటనలో నిందితుడిపై నేరం రుజువుకావడంతో శుక్రవారం సత్తుపల్లి కోర్టు యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. వివరాల్లోకెళ్తే.. మధిర పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాయన్నపేటలో పార్శపు శివరాంగోపాల్, మార్తమ్మ దంపతులు. వీరికి ఇద్దరు సంతానం కుమారుడు రామకృష్ణ(8), కుమార్తె ఆరాధ్య(6). మార్తమ్మ కూలి పనికిపోయిన సమయంలో శివరాంగోపాల్ స్కూల్‌కు వెళ్లి తన ఇద్దరు పిల్లలను మాయమాటలతో ఇంటికి తీసుకొచ్చి అతి క్రూరంగా హత్య చేశాడు. ఈ మేరకు మార్తమ్మ జూలై 11, 2023న మధిర పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసులో సాక్ష్యాధారాలు పరిశీలించిన అనంతరం శుక్రవారం సత్తుపల్లి సిక్స్త్ అడిషనల్ సెషన్స్ జడ్జి ఎం.శ్రీనివాస్ నేరస్తుడికి జీవితకాలం శిక్ష విధించారు. ఈ కేసులో ఎం.అబ్దుల్‌భాషా పీపీగా ఉన్నారు.

గోతిలో పడిన బైక్

పాలేరులో గోతిలో పడిన మోటర్‌సైకిల్

కూసుమంచి, ఆగస్టు 30 : రోడ్డు పక్కగా తీసిన గోతిలో ప్రమాదవశాత్తు ఓ మోటర్‌సైకిల్ పడడంతో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన పాలేరులో శుక్రవారం చోటుచేసుకుంది. మోతె మండలం గోపతండాకు చెందిన వెంకన్న ద్విచక్రవాహనంపై పాలేరు సంతకు రాగా రోడ్డు పక్కనే మిషన్ భగీరథ నీటి కోసం గుంతలు తీశారు. దానిలో బైక్ ముందు చక్రం దూసుకొని పోయింది. ఈ ప్రమాదంలో వెంకన్న తలకు గాయాలు కాగా అతన్ని స్థానికులు ఆసుపత్రికి తరలించారు. గుంతలు తీసిన సదరు గుత్తేదారు ఎటువంటి రక్షణచర్యలు చేపట్టకపోవడం వల్లనే ప్రమాదం జరిగిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రికార్డురూంలో విషసర్పాలు

కొణిజర్ల, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం రికార్డు రూంలో విషసర్పాల సంచారం కార్యాలయ సిబ్బందిని కలవరపెడుతున్నాయి. సేత్వార్ పహణీలు మొదలు అడంగల్, ఇతర రికార్డులు భద్రపరిచే గది చుట్టూ పిచ్చిమొక్కలు, తూటికాడలు ఉండడంతో రికార్డురూంలోకి విషసర్పాలు చేరినట్లు అధికారులు చర్చించుకుంటున్నారు. వివిధ దరఖాస్తుదారులు రెవెన్యూకు సంబంధించిన దరఖాస్తు చేసుకున్న సమయంలో రికార్డు రూంలోని పురాతన రికార్డులు పరిశీలించాల్సి ఉంటుంది. ఆ సమయంలో రికార్డు అసిస్టెంట్లు లోపలకు వెళ్లి వేతికేందుకు జంకుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు కార్యాలయం చుట్టూ ఉన్న పిచ్చిమొక్కలు తొలగించి రికార్డురూంను భద్రతగా కొనసాగించేందుకు చర్యలు తీసుకోవాలని సిబ్బంది కోరుతున్నారు.

అంకమ్మతల్లి దేవాలయంలో చోరీ

వేంసూరు, ఆగస్టు 30 : మండలంలోని వెంకటాపురం అంకమ్మతల్లి దేవాలయంలో గురువారం రాత్రి గుర్తుతెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. అమ్మవారి ఆలయ తాళాలు పగలగొట్టి అమ్మవారి సుమారు మూడు కేజీల వెండి, 30 గ్రాముల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారు. ఆలయ కమిటీ సభ్యులు చిలుకూరు సత్యనారాయణరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వీరప్రసాద్ తెలిపారు.

లారీ, టాటా ఏస్ ఢీ

కొణిజర్ల, ఆగస్టు 30 : మండలంలోని తనికెళ్ల విజయ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో ఎదురెదురుగా వస్తున్న లారీ, టాటా ఏస్ వాహనం ఢీకొన్న ఘటనలో టాటా ఏసీ రోడ్డుకు అడ్డుగా బోల్తా పడింది. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. స్థానిక ఎస్సై సూరజ్ తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి భారీ జనరేటర్‌తో వైజాగ్ వెళ్తున్న టాటా ఏస్ వాహనాన్ని వైరా నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న లారీ ఢీ కొట్టింది. దీంతో వాహనంలోని జనరేటర్ రోడ్డుకు అడ్డంగా పడడంతోపాటు వాహనడ్రైవర్ డేరంగుల యాదయ్యకు గాయాలయ్యాయి. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రోడ్డుకు అడ్డంగా ఉన్న వాహనాన్ని తొలగించి ట్రాఫిక్‌ను నియంత్రించారు.

మంగళగూడెంలో ఫీవర్ సర్వే

ఖమ్మం రూరల్, ఆగస్టు 30 : మండల పరిధిలోని మంగళగూడెం గ్రామంలో శుక్రవారం వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు ఫీవర్ సర్వే జరిగింది. యం.వెంకటయపాలెం ప్రాథమిక వైద్యారోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్యారోగ్యశాఖ సిబ్బంది గ్రామంలో పర్యటించారు. ఇంటింటి సందర్శన చేపట్టి ఫీవర్ సర్వే నిర్వహించారు. జ్వరాల బారిన పడిన రోగులను గుర్తించి, అవసరమైన పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ ప్రస్తుతం సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మురుగునీరు నిల్వలు లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డాక్టర్ దివ్య, హెచ్ఈవో భద్రు, మాణిక్యమ్మ, గురుబాయ్, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

శభాష్.. రూరల్ పోలీస్

రోడ్లపై గుంతలు పూడ్చుతున్న పోలీసులు

ఖమ్మం రూరల్, ఆగస్టు 30 : చట్టాన్ని కాపాడడంతో పాటు, సామాజిక కార్యక్రమాల్లో సైతం ఎంతో చురుగ్గా వ్యవరిస్తున్న ఖమ్మ రూరల్ పోలీసులు మరోసారి వారి సేవానిరతిని చాటుకున్నారు. వరంగల్ క్రాస్‌రోడ్ నుంచి కోదాడ క్రాస్‌రోడ్ వరకు హైదరాబాద్ వెళ్లే ప్రధాన జాతీయ రహదారిపై గత కొంతకాలంగా గుంతలు పడుతున్నాయి. దీంతో ఆటోనగర్ నుంచి కోదాడ క్రాస్ వరకు తరచూ రోడ్ ప్రమాదాలు జరుగుతున్నాయి. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యం ఈ పరిస్థితిని గమనించిన రూరల్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది నడుంబిగించారు. స్వయంగా పలుగుపార అందుకొని గుంతలు పూడ్చి తాత్కలింగా ఉపశమనం కలిగించారు. పోలీసులు ఈ పని చేస్తుండగా చూసిన ప్రజలు శభాష్ 'రూరల్ పోలీస్' అంటూ ప్రశంసలు కురిపించారు.

సెల్‌టవర్ ఎక్కి వ్యక్తి హల్‌చల్

వెలుగుమట్ల గుడిసెలు తొలగించవద్దని డిమాండ్

రఘునాథపాలెం, ఆగస్టు 30: సెల్‌టవర్ ఎక్కి ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. మండలంలోని వీ వెంకటాయపాలెంలో శుక్రవారం ఈ ఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. కొత్త కలెక్టరేట్ సమీపంలోని వినోబానగర్ పేరుతో ఉన్న వెలుగుమట్ల రెవెన్యూ పరిధి కాలనీలో కామేపల్లి మండలం పాతలింగాలకు చెందిన నరాటి చందర్‌రావు అలియాస్ చంద్రశేఖర్ రేకులషెడ్డు నిర్మాణం చేపట్టుకున్నాడు. అయితే రెండు రోజుల క్రితం గుడిసెలను తొలగించాలని అధికారులు హెచ్చరికలు జారీ చేయడంతో ఆవేదన గురయ్యాడు. దీంతో శుక్రవారం వీ వెంకటాయపాలెం ఎస్టీ కాలనీలో ఉన్న సెల్ టవర్ ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. విషయం తెలిసిన పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని చంద్రశేఖర్‌తో చర్చించారు. సీఐ ఉస్మాన్ జోక్యం చేసుకొని న్యాయం చేస్తామంటూ చెప్పడంతో చంద్రశేఖర్ టవర్ దిగి కిందకు దిగాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

INDUSIND BANK LTD.
COMMERCIAL VEHICLE FOR SALE
1). TS28TA9312-APE XTRA LD BS6- 2022. 2). TS28TB0385-BAJAJ MAXIMA CNG BS6-2023. 3). TA28TB2620- TATA ACE GOLD DIESEL BS6- 2023
Cell:7337394783
H.No. 6-8-100, 2nd Floor, KNR Mansion, Ganesh Basthi, Kothagudem, Bhadradri Kothagudem Dist.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బోధన సాగాలి

చింతకాని, ఆగస్టు 30 : ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగాలని విశ్రాంత కలెక్టర్ ఆకునూరి మురళి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని రాఘువాపురం, రేపల్లెవాడ ప్రాథమిక, అంగన్వాడీ పాఠశాలల్లో జరుగుతున్న బోధనాభ్యసన కార్యక్రమాలను పరిశీలించి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యలో సాంకేతికను ఉపయోగించి బోధన అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖరశర్మ, సెక్టోరియల్ అధికారి రవికుమార్, ఎంఈవో శ్యాంసన్, బీవీ శర్మ, శ్రీనివాసరావు, ఎంఎన్‌వో శ్రీనివాసరావు, హెచ్ఎంలు, సీఆర్పీలు, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం

ఆయా గ్రామాల వైద్యశిబిరాల్లో డాక్టర్లు

ఉచితంగా పరీక్షలు చేసి మందులు అందజేత

వేంసూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కారేపల్లి : వైద్యపరీక్షలు చేస్తున్న సిబ్బంది

చింతకాని, ఆగస్టు 30 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని మండల వైద్యాధికారి డాక్టర్ అల్తాఫ్ అన్నారు. శుక్రవారం రామకృష్ణాపురం, లచ్చగూడెం, బొప్పారం గ్రామాల్లో వైద్యసిబ్బంది ఆధ్వర్యంలో జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమం జరిగింది. లచ్చగూడెం గ్రామంలో కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి వ్యాధులపై అవగాహన కల్పించారు. పల్లె దవాఖాన వైద్యుడు వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో టీ వీరేంద్ర, సిబ్బంది నాగేశ్వరరావు, జానీ పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, ఆగస్టు 30 : మండల పరిధిలోని జమలాపురం పంచాయతీ కండ్రిక గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. జ్వరం, జలుబు, దగ్గు, ఒళ్లునొప్పులు వ్యాధులతో బాధపడుతున్న 66 మందిని పరిశీలించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వర్షాకాల సీజన్‌లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి ఆవరణ చుట్టూ నీరు నిల్వ లేకుండా, దోమలు పెరగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జమలాపురం పల్లె దవాఖాన వైద్యురాలు కుమారి పాల్గొన్నారు.

వేంసూరు, ఆగస్టు 30 : వేంసూరు ఆరోగ్య కేంద్రం పరిధిలోని అడసర్లపాడు, బీరాపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆయూష్ ఆరోగ్య మందిరాల నిర్వాహకుల సహకారంతో ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. 62 మందికి సాధారణ, చిరువ్యాధులకు చికిత్స, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు మోనిక, ఉదయ్, ఆరోగ్య సహాయకులు శ్రీదేవి, శ్రీలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కారేపల్లి, ఆగస్టు 30 : మండలంలోని చింతల తండాలో శుక్రవారం మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. చీమలపాడు ఉప ఆరోగ్య కేంద్రం ఎంఎల్‌హెచ్‌పీ కల్యాణీ గ్రామస్తులకు పలు రకాల వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారన్నారు. జ్వర లక్షణాలు ఉన్న వారి రక్తన మూనాలను సేకరించి డెంగీ, మలేరియా, టైఫాయిడ్ పరీక్షలు చేస్తున్నట్లు చెప్పారు. సెకండ్ ఏఎన్ఎం ముక్తి నాగమణి, అంగన్‌వాడీ టీచర్ శారద, ఆశావర్కర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

పెనుబల్లి, ఆగస్టు 30 : లంకాసాగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో మండలంలోని తెలగవరంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఎఫ్ఎస్, హెచ్‌హెచ్ సర్వే చేస్తూ సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. దోమలు కుట్టకుండా డెంగీ, మలేరియా, చికెన్‌గున్యా వంటి వ్యాధులు రాకుండా దోమతెరలు వాడాలని, వేప రొట్టతో పొగ దూపం పెట్టుకోవాలన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ ఈవో శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ సుగుణదేవి, సూపర్‌వైజర్ బీ.నాగేశ్వరరావు, బషీరుద్దీన్, పొట్టమ్మ, హెల్త్‌అసిస్టెంట్ కరీముల్లా, రవి, గ్రామ పంచాయతీ సిబ్బంది, సెక్రటరీ నరసింహారావు, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

ఖమ్మంరూరల్, ఆగస్టు 30 : మండల పరిధిలోని పడమటితండాలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్యశిబిరం విజయవంతమయ్యింది. రిలయన్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పశువైద్యుడు అనంతుల హరీష్ నేతృత్వంలో వైద్యబృందం గ్రామంలోని 143 ఆవులకు ముద్దుచర్మవ్యాధి టీకాలు, 68 పశువులకు జనరల్ వైద్య చికిత్సలు, 236 జీవాలకు నట్టల నివారణ మందులు తాగించారు. శనివారం జాన్‌బాద్‌తండాలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు డాక్టర్ హరీష్ తెలిపారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి వెంకటేశ్వర్లు, పశువైద్య సిబ్బంది ఎండీ ఖాజాబాషా, వీ రామారావు, హుస్సేన్, సందీప్, జే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కూసుమంచి, ఆగస్టు 30 : హోమియోలో వృద్ధులకు మంచి మందులు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రోగ్రామింగ్ అధికారి బాబునాయక్ అన్నారు. శుక్రవారం కూసుమంచిలో డాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరంలో ఆయన మాట్లాడుతూ హోమియో వైద్యంతో ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్‌లు ఉండవన్నారు. దీర్ఘకాలిక వ్యాధులు నయమవుతాయన్నారు. డాక్టర్ కిషోర్, సిబ్బంది మాన్‌సింగ్, రామకృష్ణ, రాధ పాల్గొన్నారు.

పెనుబల్లి, ఆగస్టు 30 : వీఎం.బంజరలో వేంచేసి ఉన్న శ్రీరాజసాయి మందిరం, ఖమ్మం మమత ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం కంటి, సాధారణ వైద్యశిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆలయ చైర్మన్ జెన్నారెడ్డి విజయ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరాన్ని కొత్తగూడెం రోడ్డులో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఏర్పాటు చేయడం జరుగుతుందని, కంటి రోగులు, సాధారణ రోగులు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.